క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: వెంకటాద్రిపై బుధవారం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కనులపుండువగా నిర్వహించారు. శ్రీదేవి,భూదేవి సమేతంగా వెంకన్న ఉత్సవమూర్తులను వేదికపై అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అప్పన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే గణబాబు



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న గణబాబు దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు సతీ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు.

రోడ్డు బాగు చేశారు



ఎన్టీపీసీ- సోమునాయుడుపాలెం మధ్య వేసిన తారు రోడ్డు

సాక్షి ఎఫెక్ట్..

పరవాడ: ఎన్టీపీసీ–సోమునాయుడుపాలెం గ్రామాల మధ్య అధ్వానంగా మారిన రహదారికి హిందూజా యాజమాన్యం మరమ్మతులు చేపట్టింది. అధ్వాన రహదారికి మరమ్మతులు చేపట్టండి అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి హిందూజా యాజమాన్యం స్పందించింది. రోడ్డును అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టింది. ఎన్టీపీసీ వై జంక్షన్ నుంచి సోమునాయుడుపాలెం వంతెన వరకు ఉన్న శిథిల రహదారిని తారు రోడ్డుగా అభివృద్ధి చేసింది. దీంతో కార్మికులు, వాహన చోదకులు, భారీ వాహనాల సిబ్బంది, గ్రామీణ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ముత్యాలమ్మపాలెం తీరాన్ని అభివృద్ధి చేయాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్ ముత్యాలు

పరవాడ: ముత్యాలమ్మపాలెం తీరాన్ని టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాలని ముత్యాలమ్మపాలెం మాజీ సర్పంచ్ చింతకాయల ముత్యాలు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిని కోరారు. అనకాపల్లిలోని కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జరిగిన జిల్లా టూరిజం కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. జిల్లా నలుమూలల నుంచి తీరానికి తరచూ అనేక మంది రాకపోకలు సాగిస్తున్నారని, అయితే వచ్చే పర్యాటకులకు తీరంలో సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. లైఫ్ గార్డు లను నియమించడంతో పాటు సందర్శకులు తీరంలో షికారు చేయడానికి మోటారు బోటు సౌకర్యం కల్పించాలని కోరారు. జిల్లా కలెక్టర్‌ను కలిసిన వారిలో తిక్కవానిపాలెం సర్పంచ్ చేపల మసేను, కోఆప్షన్ సభ్యుడు మైలపల్లి అప్పన్న ఉన్నారు.

చర్చలు.. సమాధానాలు



మాట్లాడుతున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి



పాల్గొన్న ప్రజా ప్రతినిధులు,మండల స్థాయి అధికారులు

సుదీర్ఘంగా సాగిన మండల సర్వసభ్యసమావేశం

సబ్బవరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సమగ్రంగా సాగింది. సభ్యులు పలు సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. దానికి సంబంధిత అధికారులు సమాధానాలు ఇచ్చారు. ఎంపీపీ బోకం సూర్యకుమారి అవసరమైన సూచనలు ఇచ్చారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సమావేశం సుదీర్ఘంగా సాగింది.

సమీక్షలో వచ్చిన ప్రధాన అంశాలు

ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మారుస్తున్నా.. అందుకు తగిన స్థాయిలో విద్యార్థుల సామర్థ్యం ఉండడం లేదని తవ్వవానిపాలెం ఎంపీటీసీ బోకం బాలకృష్ణ అన్నారు. బోధన మెరుగుపడాలని సూచించారు. దీనికి మండల విద్యాశాఖాధికారులు ఎస్. లక్ష్మణరావు, వీఎస్ఎన్ మూర్తి విద్యాశాఖ పనితీరు,పురోగతిని వివరించారు. ప్రజాప్రతినిధుల సహకారంతో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడితే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని సభ్యులు విద్యాశాఖాధికారులకు సూచించారు.

- ఐసీడీఎస్ సీడీపీవో లలిత్ కుమారి మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల పురోగతి వివరించారు. మండలంలో 730 మంది గర్భిణులు ఉండగా వారికి ఇళ్లకే పోషకాహారం అందిస్తున్నామన్నారు.
- నల్లరేగులపాలెంలో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని, సబ్బవరంలో వీధిలైట్లు వెలగడం లేదని ఆయా ఎంపీటీసీలు ప్రస్తావించారు. విద్యుత్ శాఖ ఏఈ అశోక్ స్పందించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.
- వ్యవసాయానికి సంబంధించి వరి సాగుకు అవసరమైన ఎరువులు, క్రిమి సంహారక మందులు అన్ని రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉంచామని ఏవో పోతల సత్యనారాయణ తెలిపారు.
- ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని మండలంలో విజయవంతంగా నిర్వహిస్తున్నామని సబ్బవరం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తి తెలిపారు. ప్రజాప్రతినిధులు మరిన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు. సబ్బవరం పీహెచ్‌సీకి ప్రతిరోజు 100 నుంచి 150 ఓపీ వస్తుందని.. టార్గెట్స్ అచీవ్‌మెంట్‌లో జిల్లాలోనే ముందు వరసలో ఉందని వివరించారు.
- ఉత్తమ మండల పరిషత్ అవార్డు అందుకోవడంతో దానికి వచ్చిన రూ.25 లక్షల ప్రోత్సాహక నిధులతో సమావేశమందిరం అదనపు అంతస్తు నిర్మించినట్లు ఎంపీడీవో రమేష్ నాయుడు తెలిపారు.

ఆక్రమణలకు చెక్ పెట్టండి

మండలంలో పలు చోట్ల ఆర్ అండ్‌బీ రోడ్లు అధికంగా ఆక్రమణలకు గురవుతున్నాయని వాటికి చెక్ పెట్టాలని ఎంపీపీ సూర్యకుమారి ఆదేశించారు. మరిన్ని రోడ్లు అభివృద్ధి చేయాలని ఎంపీపీ అధికారులను ఆదేశించారు.

సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, వైస్ ఎంపీపీ దాడి ఝాన్సీ లక్ష్మీరాణి, చొక్కాకుల గోవింద్, తహసీల్దార్ సత్యనారాయణ, మండలపరిషత్ ఏవో బాబూరావుతో పాటు ఎంపీటీసీలు,సర్పంచ్‌లు,మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలవి పసలేని విమర్శలు

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్

సబ్బవరం: ప్రజాస్వామ్య దేశంలో ప్రతిపక్షాలు ప్రభుత్వాలపై ఆరోపణలు చేసేందుకు హక్కు ఉంటుందని, అయితే వాస్తవాలు మరిచి విమర్శలు చేయడం తగదని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అన్నారు. ఎన్నికల సమీపిస్తుండడంతో ప్రతిపక్షాలు పసలేని ఆరోపణలు చేస్తున్నాయని ఎద్దేవా చేశారు.. సబ్బవరం మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో 30 ఏళ్లుగా సౌకర్యానికి నోచుకోని 50 అడుగుల రోడ్డు నిర్మాణానికి ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. సుమారు రూ.40 లక్షలతో రోడ్ మధ్యలో డివైడర్ ఏర్పాటు చేసి విశాలంగా రెండు వరుసల రోడ్డు నిర్మిస్తామన్నారు. రూ.20లక్షలు జీజీఎస్ నుంచి, మరో రూ. 20 లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి కేటాయించినట్లు చెప్పారు. ఈ రోడ్డు పూర్తయిన తర్వాతే కాలనీవాసులను ఓట్లు అడిగేందుకు వెళ్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంక్షేమం,అభివృద్ధిని రెండు కళ్లలా భావిస్తున్నారని చెప్పారు. మండలంలోని అనేక రోడ్లు అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, జెడ్పీ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కొటాన రాము, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, మాజీ ఎంపీపీ ముత్యాల నాయుడు, వైస్ ఎంపీపీలు చొక్కాకుల గోవింద్, దాడి ఝాన్సీ లక్ష్మీరాణి, సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, బోను గంగు నాయుడు, కాపు శెట్టి శేషుబాబు,పల్ల కృష్ణ, ఎర్రంశెట్టి రాము, దెడ్డం పద్మావతి, ధనిమిరెడ్డి శ్రీనివాస్, సబ్బవరపు నాగభూషణం, సబ్బవరపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సింహగిరి వర్తక సంఘ నూతన అధ్యక్షుడిగా కిరణ్

ప్రధాన కార్యదర్శిగా కర్రి అప్పలస్వామి



నూతన అధ్యక్ష, కార్యదర్శులకు అప్పన్న ఫొటో అందజేస్తున్న సింహగిరి వర్తకులు

సింహాచలం: సింహగిరి వర్తక సంఘం నూతన అధ్యక్షుడిగా మొగ్గ కిరణ్, ప్రధాన కార్యదర్శిగా కర్రి అప్పలస్వామి నియమితులయ్యారు. సింహగిరిపై బుధవారం వర్తకులంతా కలిసి మొగ్గ కిరణ్, కర్రి అప్పలస్వామిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వర్తకుల సమస్యలను దేవస్థానం అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామని ఈ సందర్భంగా కిరణ్, అప్పలస్వామి తెలిపారు. వర్తకులందరికీ శాశ్వత షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం జరిగేలా అధికారులతో మాట్లాడతామని హామీ ఇచ్చారు. అలాగే మూడేళ్లకోసారి 50 శాతం అద్దె పెంపువల్ల వర్తకులు పడుతున్న ఇబ్బందులను కూడా దేవదాయశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను వర్తకులంతా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వర్తక సంఘం మాజీ అధ్యక్షుడు బంటుబిల్లి మహేష్, వర్తక సంఘం ఉపాధ్యక్షుడు సానబోయిన రాజు ,కార్యదర్శి గుడ్ల గురునాథరావు, ఉప కార్యదర్శి దొంతల శంకర్, వర్తకులు బంటుబిల్లి సురేష్ పాల్గొన్నారు.

చీటీల నిర్వాహకులపై కేసు నమోదు చేయాలి

- పోలీస్ స్టేషన్ వద్ద బాధిత మహిళల నిరసన

సింహాచలం: తమను మోసగించిన చీటీల నిర్వాహకులపై కేసు నమోదు చేయాలని పెందుర్తి పోలీస్ స్టేషన్ వద్ద బుధవారం రాత్రి పలువురు మహిళలు నిరసన వ్యక్తం చేశారు. బాధిత మహిళలు తెలిపిన వివరాల ప్రకారం.. పెందుర్తికి చెందిన పద్మావతి అనే మహిళ వద్ద చీటీలు కట్టారు. సుమారు నాలుగు కోట్లు వరకు చీటీల పేరిట ఆమె వసూలు చేసిందన్నారు. నెల రోజుల నుంచి పద్మావతి కనిపించలేదన్నారు. ఫోన్ కూడా పని చేయడం లేదని వాపోయారు. దీంతో వరలక్ష్మి పార్టనర్‌గా వ్యక్తిపై గత నెల 21న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ కేసు విషయంపై పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీంతో తామంతా స్టేషన్ ముందు ధర్నా చేయగా పోలీసులు సదరు వ్యక్తిని స్టేషన్‌కు పిలిపించడం జరిగిందన్నారు. తమకు న్యాయం చేయాలన్నారు. విచారణ చేస్తున్నామని ఎస్ఐ అసిరి తాత తెలిపారు.

టీడీపీ నాయకుల కబ్జాల పర్వం



డిప్యూటీ తహసీల్దార్ రంగలక్ష్మికి వినతిపత్రం దళిత అందజేస్తున్న రైతులు

సింహాచలం: వాలిమెరక జుత్తాడ రెవెన్యూ పరిధిలో పలు చోట్ల టీడీపీ నాయకులు ప్రభుత్వ భూములు కబ్జా చేశారని స్థానిక దళిత రైతులు ఆరోపించారు. బుధవారం పెందుర్తి ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడారు. వాలిమెరక జుత్తాడ రెవెన్యూ సర్వే నంబర్ 98, 99ల్లో భూముల విషయమై మాజీ మంత్రి, టీడీపీ నేత బండారు సత్యనారాయణమూర్తి చేసిన వ్యాఖ్యలపై ధ్వజమెత్తారు. వాలిమెరక పరిధిలోని సర్వే నంబర్ 21/2లో సుమారు ఎకరం ప్రభుత్వ స్థలాన్ని, జుత్తాడ పరిధిలోని సర్వే నంబర్ 40లో 1.5 ఎకరం పాలగట్టు చెరువు, 56/4లోని సుమారు ఎకరం ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేశారన్నారు.

- జుత్తాడ రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 55లో టీడీపీ నాయకులు అక్రమంగా వేసిన లేఅవుట్‌కు ప్రభుత్వ అనుమతులు లేకుండా 44 ఇళ్ల స్థలాలుగా విభజించి బయటి వ్యక్తులకు విక్రయించారన్నారు.
- సర్వే నంబర్ 55లో టీడీపీ ప్రభుత్వం హయాంలో ఎక్స్ ఎంపీటీసీకి మంజూరు చేసిన ప్లాట్ నంబర్ 07కు కనీసం బేస్‌మెంట్ కూడా పూర్తి కాకపోయినా ఇల్లు పూర్తయినట్టు ప్రభుత్వం నుంచి బిల్లు మొత్తం తీసుకున్నారన్నారు.
- ప్రభుత్వం మంజూరు చేసిన బోరును టీడీపీ నాయకుల సొంత స్థలంలో, టీడీపీకి చెందిన ఎక్స్ ఎంటీటీసీ సొంతింటి స్థలంలో వేసుకున్నారని చెప్పారు.
- గతంలో టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసిన 80 గజాల గృహ స్థలాన్ని 150 గజాల వరకు ఆక్రమించి ఇల్లు నిర్మించుకున్నారని తెలిపారు. టీడీపీ నాయకుల భూ అక్రమాలపై గతంలో కలెక్టర్, తహసీల్దార్‌ల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రంగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు.

నేడు ఏయూలో ఉద్యోగ మేళా

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్, గైడెన్స్ బ్యూరో, మోడల్ కెరీర్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు డిప్యూటీ చీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. మెడ్‌ప్లస్ ఇండియా సంస్థలో ఫార్మాసిస్ట్, ఫార్మసీ ఎయిడ్, సీఎస్, డెలివరీ అసిస్టెంట్ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. మొత్తం 90 ఖాళీలను భర్తీ చేస్తామని, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ కోర్సులను పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చునన్నారు. నెలకు రూ.11,080 నుంచి రూ.16 వేలు మధ్య వేతనం చెల్లిస్తారన్నారు. ఆసక్తి కలిగిన వారు ఏపిట జౌరి. జీ వెబ్‌సైట్ నుంచి వివరాలు నమోదు చేసుకుని గురువారం ఉదయం 10.30 గంటలకు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. పూర్తి సమాచారం కోసం 96660 92491 నంబరులో సంప్రదించాలన్నారు.

క్విట్ అదానీ.. సేవ్ వర్కర్స్

నినదించిన గంగవరం పోర్టు కార్మికులు

పెదగంట్యాడ: 'క్విట్ అదానీ.. సేవ్ వర్కర్స్', 'క్విట్ మోదీ.. సేవ్ ఇండియా' నినాదాలతో పోర్టు కార్మికులు నినదించారు. అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న నిర్వాసిత కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన వద్ద చేపట్టిన నిరవధిక దీక్షలు బుధవారానికి 37వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో భాగంగా క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. పెదగంట్యాడ జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. యాజమాన్యం వెంటనే స్పందించి జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొవిరి అప్పలరాజు, వాసుపల్లి ఎల్లాజీ, మాద అప్పారావు, సత్యానందం, నొల్లి స్వామి, పేర్ల నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

మహారాణిపేట: పిల్లల్లో ఎన్నో వ్యాధులకు కారణమైన నులి పురుగుల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గురువారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినంగా పాటిస్తున్నట్టు, పాఠశాలల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రాలు ఉచితంగా పంపిణీ చేస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 1900 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, 62 కాలేజీలు, 742 అంగన్‌వాడీ కేంద్రాల్లో మొత్తం 4,75,358 మంది విద్యార్థులు ఉన్నారని, వారికి గురువారం ఉచితంగా మాత్రలు పంపిణీ చేయనున్నామన్నారు. ఏడాది నుంచి రెండేళ్లలోపు పిల్లలకు సగం మాత్ర, 2 నుంచి 3 సంవత్సరాల లోపు పిల్లలకు పూర్తి మాత్రను నీటిలో కరిగించి తాగించాలన్నారు. 3 నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలకు పూర్తి మాత్ర ఇచ్చి చప్పరించాలని సూచించారు. మధ్యాహ్నం భోజనం చేసిన అరగంట తర్వాత మాత్ర ఇవ్వాలన్నారు. మాత్రల పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. గురువారం మాత్రలు వినియోగించలేని వారి కోసం తిరిగి ఈనెల 17న మాప్ ఆప్ రౌండ్ కింద అవసరమైన వారికి మాత్రలు అందిస్తామన్నారు. 5,20,000కు పైగా మాత్రలు సిద్ధం చేశామని డీఎంహెచ్‌వో తెలిపారు.

సింహాచలేశుడికి వైభవంగా ఆర్జిత సేవలు



స్వామికి యజ్ఞోపవీతధారణ చేస్తున్న అర్చకుడు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటలకు ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు చక్రవర్తి తదితరులు ఈసేవ నిర్వహించారు.

వైభవంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం గరుడ సేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై అధిష్ఠంపజేశారు. అష్టోత్తరశత నామావళి పూజని నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

ఘనంగా సహస్రనామార్చన

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం సహస్ర నామార్చన విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులకు 1001 నామాలతో పూజ చేసి హారతులు అందజేశారు.

నిందితుడికి రిమాండ్

డీఎస్పీ సత్యనారాయణ



సీఐ రంగనాథంతో కలిసి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

సబ్బవరం : మండలంలోని నారపాడు గ్రామంలో వివాహితపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు పరవాడ డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. సబ్బవరం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామానికి చెందిన రాజాన అప్పారావు(36) అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన మానసిక వైకల్యంతో ఉన్న మహిళపై లైంగికదాడి చేసినట్టు చెప్పారు. వారం రోజుల కిందట బాధితురాలి భర్త గ్రామంలో లేని సమయంలో మధ్యాహ్నం ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడన్నారు. విషయం బహిర్గతం కాకుండా పెద్దలు న్యాయం చేస్తారనడంతో వెంటనే ఫిర్యాదు ఇవ్వలేదని, అయితే నిందితుడి నుంచి సరైన స్పందన రాకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈమేరకు ఎస్ఐ ఎల్.సురేష్ కేసు నమోదు చేశారన్నారు. ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే దర్యాప్తు పూర్తి చేసి నిందితుడిని అరెస్ట్ చేసి సీఐ రంగనాథం జుడీషియల్ రిమాండ్‌కు తరలించారని చెప్పారు. సమావేశంలో సీఐ రంగనాథం, ఎస్ఐ సురేష్ పాల్గొన్నారు.

మహిళలకు వజ్రాయుధం దిశాయాప్

- అసాంఘిక కార్యకలాపాలపై నిఘా
- డీఎస్పీ సత్యనారాయణ

సబ్బవరం: మహిళలు,బాలికలపై ఎవరైనా దాడులు చేసినా, అసభ్యకరంగా ప్రవర్తించినా తీవ్రమైన చర్యలు తప్పవని పరవాడ డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. సబ్బవరం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆ పదలో ఉన్న మహిళలకు దిశా యాప్ వజ్రాయుధంలా ఉపయోగపడుతుందన్నారు. దిశా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆపద సమయంలో పోలీసులకు సమాచారం అందిస్తే పోలీసులు వారికి రక్షణగా నిలుస్తారని చెప్పారు. జాతీయ రహదారులను ప్రమాద రహిత రహదారులుగా తీర్చిదిద్దేందుకు హైవే పెట్రోలింగ్ వాహనాలు తిరుగుతూ ఉండాలని అనకాపల్లి ఎస్పీ ఆదేశించారన్నారు. దీంతో సబ్బవరంలోని జాతీయ రహదారితో పాటు దానికి అనుసంధానమైన ప్రధాన రహదారుల్లో నిత్యం హైవే పెట్రోలింగ్ వాహనం తిరుగుతూ పోలీసు సిబ్బంది గస్తీ నిర్వహిస్తారన్నారు. వీటితో మండలంలోని ప్రధాన రహదారుల్లో ప్రమాదకర ప్రదేశాలను గుర్తించి రేడియం స్టిక్కర్లు,స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తామన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్టు చెప్పారు. గంజాయి అక్రమ రవాణా మండలం మీదుగా వెళ్లకుండా నిత్యం నిఘా ఏర్పాటు చేశామన్నారు. గంజాయి అక్రమ తరలింపులో భాగస్వాములుగా ఉన్న పాత నేరస్తుల కదలికలపై నిఘా పెట్టి రాష్ట్ర ప్రభుత్వం ఉక్కు పాదంతో అణచివేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. యువత రాత్రి సమయాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి వాహనాలు నడపడం నేరం అన్నారు. దీనిపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటామన్నారు.చిన్న పిల్లలు,మహిళల హక్కులను కాపాడి వారికి నిరంతరం రక్షణగా నిలవడం జరుగుతుందన్నారు. ఈవ్‌టీజింగ్,ర్యాగింగ్ జరగకుండా కళాశాలలు,పాఠశాలల వద్ద మహిళా పోలీస్‌లను మఫ్టీలో ఉంచడం జరుగుతుందని చెప్పారు.

ఘనంగా నామట్టి-నా దేశం



వీర జవాన్ వెంకటేష్ తల్లిదండ్రులను సత్కరిస్తున్న ఎంపీపీ నాగమణి



చెరువు వద్ద నిర్వహించిన ప్రతిజ్ఞలో పాల్గొన్న సర్పంచ్ అప్పారావు, వివిధ శాఖల ఉద్యోగులు

సింహాచలం: ఎస్ఆర్‌పురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం నామట్టి-నాదేశం, నేలతల్లికి నమస్కారం-వీరులకు వందనం కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న పెందుర్తి ఎంపీపీ మధుపాడ నాగమణి భారతదేశం గొప్పదనాన్ని వివరించారు. ఈ సందర్భంగా వీర జవాన్ గొరపల్లి వెంకటేష్ తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ దూది విజయలక్ష్మి వెంకటరమణ, జెడ్పీటీసీ ఉప్పిలి దేవి, ఎంపీడీవో వసంత, ఏపీవో గోవిందరావు, వైస్ సర్పంచ్ అల్లూరి గణపతి సోమరాజు పాల్గొన్నారు.

'నేల తల్లికి నమస్కారం.. వీరులకు వందనం

పరవాడ: మండలంలోని వెన్నలపాలెం గ్రామంలో ఆజాదీ కా అమృత్ వార్షికోత్సవంలో భాగంగా నా మట్టి- నా దేశం, నేల తల్లికి నమస్కారం- వీరులకు వందనం ప్రతిజ్ఞ నిర్వహించారు. బొడ్డపువాని చెరువు వద్ద సర్పంచ్ వెన్నల అప్పారావు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, ఎనర్జీస్ సిబ్బంది, వలంటీర్లు మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెన్నల సన్యాసిరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పైల అప్పలనాయుడు, పైల సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీ దళార్చన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో పూజా రుసుం చెల్లించాలి.